శారద లేఖలు

సౌభాగ్యవతియగు కల్పలతకు·

నెచ్చెలీ,

నీవు వ్రాసిన యుత్తరములు నిన్ననే వచ్చిచూచితిని. నీకు జాబు వ్రాయుటకే నాకు సిగ్గగుచున్నది. ఏమందువా? ఇకనుండి తప్పక వ్రాయుదునని నీకు వాగ్దత్తము సేయుటయు ఆమధ్య జాబే నీకు సకాలమున వ్రాయజాలక పోవుటయు పలుమారులు తటస్థించుచున్నది. శారదకు, మాటలకు చేతలకు దూరమని నీవు తలంతువేమో యని నాబిడియము కాని యిది స్వయంకృతాపరాధముకాదు. దక్షిణ దేశయాత్ర జేసెడు భాగ్యము నాకింతలో లభించునని నేను స్వప్నమందైన తలంపలేదు. దైవికముగ క్షణములో తటస్థించినది. ఆనాడు నీకు లిఖించుచున్న లేఖనర్ధాంతరముననే విడిచి తత్క్షణమే యాత్రకు సన్నద్ధనైతిని. వైకుంఠేకాదశి నాటికి శ్రీరంగమున కేగవలెనని పయనించెడు నాటి మాతలంపు కాని చేరలేకపోతిమి. కాన యూరక చెన్నపట్టణమున నాదినమేల గడుపవలెనని కాంచీపురమున కేగితిమి. ఉన్నతోన్నత ప్రాకార గోపురావళుల తోడను, విశాలమైన రాచబాటతోడను ఒప్పారు కాంచీపురము పూర్వ వైభవమును చాటుచుండెను. కాంచీపురము విష్ణుకంచి, శివకంచియని రెండుభాగములుగా నున్నది విష్ణుకంచిలో స్వామి వరదరాజులు ఆయన భార్య లక్ష్మీదేవి. శివకంచిలో స్వామి ఏకామ్రనాథుడు ఆయన దేవేరి కామాక్షీదేవి. దశమినాటి రాత్రి ఎనిమిది గంటలకు మేము కంజీవరమేగు నప్పటికి ఏకామ్రేశ్వరుని యాలయములో గొప్ప యుత్సవము జరుగుచుండెను. వెంటనే యాస్వామి దర్శనము సేయనేగితిమి. వెలలేని యాభరణములతో నలంకృతులైన కామాక్షీ యేకామ్రనాథులు మాకక్కడ ప్రత్యక్షమైరి. ఆదివ్యమూర్తుల కన్నారగాంచి చేతులార నమస్కరించి మనసార సేవించి హృష్ట చిత్తులమైతిమి. ఆదేవాలయమందే నాకొక మిత్రురాలు గన్పడెను. ఆమె పుట్టినిల్లా యూరని యెఱుగుదును గాని యామె నప్పుడు చూడగల్గుదునని మాత్రము తలంపలేదు. దైవికముగనే యట్టి భాగ్యము గలిగెను. ఆమె మమ్ము ప్రేమతో తన యింటికి

దోడ్కొని వెళ్లి సకల సౌకర్యముల గూర్చి సత్కరించెను. ఎఱుక పిడికెడు ధనమని సామ్యమందు రిదియే కాబోలునని యనుకొంటిని.

నాడు లేచి ప్రాతఃకృత్యములను దీర్చుకొని సర్వతీర్థమను పుష్కరిణిలో స్నానము గావించి కచ్ఛపేశ్వర యేకామ్రేశ్వర కామాక్షీ యాలయములకేగి ఆయాదేవతల దర్శించి ఆనా డూరేగవచ్చిన స్వాములందఱను దర్శించి రెండు గంటలకు విష్ణు కంచికి వెళ్లితిమి. మేము వెళ్లునప్పటికి వరదరాజస్వామివారికి తిరుమంజనము (స్నానము) జరుగుచుండెను. బిందెలతో కుమ్మరించెడు పాలధారలు శిరస్సునుండి ధణధణ పడుచుండ పాలలో మునిగియున్న స్వామిని దర్శించితిమి. అటనుండి అమ్మవారి యాలయము లోని కేగుచుండ నొకమూల కొందఱు జనులు గుంపులుగా కూడియుండుట మా కగుపించెను. అదియేదియో యరయ మేమును నటకేగి చూడ నచ్చట మిద్దెకు వెండి పైడి బల్లులు అంటించబడి యుండెను. ఆ బల్లులకు క్రిందుగా నొక నిచ్చెనపై నెక్కి చేతితో ముట్టిన వారు తలకొక యణాయును, క్రిందనుండియే యర్చకుడా బల్లులపైకి గుడ్డ నెగుర వేయ ఆగుడ్డ ముట్టిన వారొక యర్ధణాయును నీయవలెనట. ఆ బల్లులను తాకి వచ్చిన వారికి బల్లిపాటు దోషముండదట. ఆ వినోదమును రెండు నిమిషముల పాటు నిలువబడి చూచితినే గాని నేను అర్ధణాగాని అణాగాని వ్యయపరచుకొనలేదు. అటనుండి అమ్మ వారి ఆలయములోని కేగ ఆమెకును స్నానమే జరుగుచుండెను. అయ్యవారి స్నానము చూడవచ్చును గాని అమ్మ వారి స్నానము చూడరాదట! కాన అమ్మవారి దర్శనము మాకుకాలేదు. ఆనాడు యేకాదశి యగుటవలన నూరేగింపు నిమిత్తము మణి మయాభరణములతో నలంకరింపబడిన యుత్సవ విగ్రహముల కడనే స్వామిని దేవేరిని గూడ చక్కగా చూచుట కలిగినది.

వరదరాజస్వామివారి యాలయములో దర్శనీయమైన మండప మొకటియున్నది. ఆ మండపములోని ప్రతి స్తంభముపైనను భారత భాగవత రామాయణాది పౌరాణిక గాథలెల్ల బొమ్మలుగా చెక్కియున్నవి. నల్లరాతితో చెక్కబడిన యాప్రతిమలు సజీవము లట్లెంతయో కౌశలముగ నిర్మింపబడియున్నవి. పౌరాణికగాథలే గాక అశ్వారూఢులగు యోధులును, శత్రుమర్దనము సేయుచున్న రాజుల ప్రతిమలును అలనాటి యోధులయు, ప్రభులయు యాకృతులను స్పష్టీకరింపుచు నెంతయో నిపుణముగ నిర్మింపఁబడియున్నవి. ముష్కరులైన తురుష్కులు శిథిలపఱచిన విగ్రహములుఁగూడ కొన్ని యున్నవి. కాని అవి

అత్యల్పమని చెప్పవలెను. కాకతీయ ప్రతాపరుద్ర కృష్ణదేవరాయాది ఆంధ్ర రాజన్యులు, యవనసేనావాహిని దక్షిణ హిందూదేశమును చొరకుండ చేసిరి. ఆనాడాంధ్రులోడ్చిన రక్తమువలననే నేడు దక్షిణ హిందూదేశమందైన పురాతనకట్టడములను ఆలయములను జూచు భాగ్యము యావద్భారతీయులకు గల్గినది. దేవాలయములను మసీదులుగను హిందువులను మహమ్మదీయులుగను మార్చి ఉత్తర హిందూదేశ మంతయు బీభత్సముగ జేసిన ముష్కరతురుష్కుల యుద్ధతినణచి దక్షిణ హిందూదేశము యవనహస్తగతము కాకుండ కాపాడిన మనయాంధ్ర వీరుల పరాక్రమాతిశయము సంస్తవనీయమైనది. ఆంధ్రులిందులకు గర్వించవలసినదే. కాంచీపురము చాలకాలము పల్లవరాజధానియై యుండుటచే పల్లవరాజులు కట్టించిన దేవాలయములు పెక్కులున్నవి. పల్లవరాజులు శివభక్తులు. కాన శివకంచి యందలి దేవాలయములన్నియు దాదాపుగా వారు కట్టించినవే. వరదరాజస్వామివారి ఆలయము కృష్ణదేవరాయలు కట్టించెనని యక్కడివారు చెప్పిరి కాని అది యెంతవఱకు నిజమో! మేము తరువాత చూచిన క్షేత్రము చిదంబరము. అచ్చటి స్వామి నటరాజు. ఆయనదేవేరి శివకామసుందరి. నటరాజ స్వామికి ఆరుద్ర నక్షత్రమునకు గొప్ప యుత్సవము జగుగును. మేము వెళ్లునప్పటికి ఆరుద్రదర్శనము రెండు దినములు మాత్రమే యుండెను. కాన పరిషజ్జనముచే పురము క్రిక్కిరిసి యుండెను. నటరాజస్వామి శ్రీమంతులగు నాటుకోటి సెట్లకు యిష్టదైవమగుటచే గాబోలు శ్రీమంతుడుగనే యున్నాడు. స్వామికి గల యాభరణములన్నియు రత్నాభరణములే. వాహనములన్నియు బంగారు వాహనములే. ఒక్క వాహనము లేగాదు. దేవాలయపు హైకప్పేమి, ధ్వజస్తంభ మేమి, అంతయు బంగారుమయము. నాడు వాన బాధ యధికముగా నున్నను జనసమ్మర్దముగా నున్నను నటరాజ స్వామిని బాగుగనే దర్శించితిమి. కాని చిదంబర రహస్యమును మాత్రము చూడలేదు. ఒక సాలగ్రామమునందు కర్పూర హారతిచేసి చూడ నటరాజస్వామి యగుపడునట. దానిని ఉత్సవము మూడుదినములు చూపరట కాన మేము చూడలేదు. అటనుండి కుంభకోణమున కేగితిమి. అచటి స్వామి కుంభేశ్వరుడు. ఆయన భార్య మంగళాంబ. చిదంబరములోనే కావేరి పాతుయగు కొల్లడమున్నది. కాన అచ్చటినుండియే పచ్చని పైరులు ఫలవృక్షములు చక్కగా కన్పడ జొచ్చినవి. దాని కంటె చక్కగా నున్నది కుంభకోణము. కుంభకోణము కావేరీతీరమగుటచే పచ్చని తోటల తోడను చక్కని జలప్రవాహముల తోడను శుభ్రజలప్రపూర్ణములగు పుష్కరిణులతోడను చూడ సొంపుగానున్నది. కుంభేశ్వరాలయమే గాక సారంగపాణి దండ

పాణి, రామస్వామి మున్నగు యితర దేవాలయములు గూడ చాలయున్నవి. అక్కడ నుండి తంజావూరు వెళ్లితిమి. తంజావూరు చారిత్రక ప్రసిద్ధమైన నగరము. చోళరాజులకు రాజధాని. అచ్చటి ప్రసిద్ధమైన బృహదీశ్వరాలయము చోళరాజులు కట్టించినదే. బృహదీశ్వరాలయపు గోపురమువంటి గోపురము మఱి యెచ్చటనులేదు. దాని నీడ భూమిపై పడదట. అది శిల్ప శాస్త్రజ్ఞుల నైపుణియని యచ్చటి వారందురు. ఆ గోపురపు ప్రశస్తిని విని విదేశీయులు గూడ దానిని చూడ వత్తురట. ఆ యాలయములోని నందిగూడ చాల యద్భుతముగా నున్నది. ఆ దేవాలయపు గోపురము మీదను మండపస్తంభముల మీదనున్న ప్రతిమలు చిత్తరువులు ప్రాచీనుల శిల్పకళానిపుణతను చాటుచున్నవి. ఆ దేవాలయమే గాక తంజావూరిలో చూడదగిన విశేషములు మఱికొన్ని యున్నవి. అందు ముఖ్యమైనవి పూర్వరాజుల కోటలు, రాజమందిరములు, వారి ఆయుధములు, వాహనములు, వారి చిత్తరువులు మున్నగునవి. వానినెల్ల మేము చూచితిమి. తిరుమలనాయుని దర్బారు మందిర మెంతయో రమణీయముగ నుండి నిన్ననేపు నిర్మించినట్లు కొంగ్రొత్తగ నున్నది. తిరుమలనాయుని శిలాప్రతిమగూడనందు గలదు. తిరుమలనాయుని చిత్తరువులే గాక మహారాష్ట్ర ప్రభువుల చిత్తరువు లనేక మందు గాంచితిమి. తంజావూరు మహారాష్ట్ర పాలన కెప్పుడు వశమైనదో జ్ఞాపకములేదు. ఆ విషయము తెలిసికొను నిమిత్తము చరిత్రను జదువ నుద్యమింపుచున్నాను. ఇంతియే గాక తంజావూరు కోటలో మఱియొక చూడదగిన మందిరమున్నది. అది సరస్వతీమహాల్ అను పేరుగల ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారము. ఈ గ్రంథాలయమున అసంఖ్యాక తాళపత్ర గ్రంథము లుండుటచే కవులకు, పండితులకు చారిత్రక పరిశోధకులకు నిది పెన్నిధిగానున్నది. అచ్చట కొంద ఱుద్యోగులుండి శిథిల గ్రంథములకు ప్రతులు వ్రాయుచున్నారు. మఱికొంద ఱేకాంతమున గూర్చుండి ప్రాచీన గ్రంథ శోధనము గావింపుచున్నారు. వారు బహుశః గ్రంథ పరిశీలనకై గ్రామాంతరములనుండి వచ్చినవారై యుండనోపు. శిలములై జీర్ణములై పోయిన పూర్వరాజ చరిత్రములను కవి పండిత జీవితములను నెఱుకపరచుచు భారతీయులకు ముఖ్యముగా దక్షిణ హిందూదేశీయులకు నమూల్య ప్రయోజనము గలిగింపుచున్నది. తంజావూరు పాలకులలో మన తెలుగువారు గూడ నుండుటచే ఆనాడు వారు వ్రాయించిన గ్రంథములు శాసనములు మున్నగునవి మన ఆంధ్రుల చరిత్రము నెఱుగుట కెక్కువగా దోడ్పడుచున్నవి. మిత్రమా! తంజావూరియందు మన ఆంధ్రులు చూచి సంతోషింప వలసిన విశేషములు పెక్కులున్నను దురదృష్టవశమున ఆనాఁడు వారి యధికముగా

నుండుటచే తనివితీర చూడజాలక పోయితిమని తెల్పుటకు చింతిల్లుచున్నాను. అటనుండి మధురకు వెళ్లితిమి. మధుర ప్రాచీన నగరము. పాండ్యరాజులకు రాజధాని. మధురలోని మీనాక్షీదేవ్యాలయము సుప్రసిద్ధమైనది. అచ్చట దేవికే ప్రసిద్ధి యెక్కువ. కాని మీనాక్షి సుందరేశ్వరుని భార్య యగును. మీనాక్షీదేవ్యాలయ మొక చిన్న నగరమువలె నున్నది. ఆయాలయ పుణ్యక్షేత్రమున లేని వస్తువులేదు. పుష్పములు, పండ్లు, బొమ్మలు, పటములు, నగలు, వస్త్రములు, పాత్రములు, పరికరములు మున్నగు సమస్తవస్తు దుకాణములందే యున్నవి. గుడ్డ నేసుకొనిన వారలకు బోయి కొనుక్కొను కొన వలసిన బాధ లేకుండ నచ్చటనున్న కుట్టు యంత్రములకు లెక్కలేదు. కాని అవి అన్నియు చేతి యంత్రములు. కాలితో త్రొక్కెడి కుట్టు యంత్రములేమియు కనబడ నున్నవి యేలనో. చెన్నరాజధానిలో చెన్నపురి తరువాత మధురయే పెద్ద పట్టణము కాన నీటి కొళాయిలు, విద్యుద్దీపములు, మోటారుకారులు మున్నగు నాగరికోప కరములచే పట్టణము కలకల లాడుచుండును. మీనాక్షీఆలయముగూడ విద్యుద్దీపములచే ధగధగమని ప్రకాశింపుచుండును. మీనాక్షీదేవికి గూడ సంపదకు కొదువలేదు. విలువైన రత్నాభరణములును పసిడివాహనములును బహుళముగనున్నవి. అయినను మూల విగ్రహము దర్పములేక సౌమ్యముగనుండును. శుక్రవారమునాటిరాత్రి యామె దర్శనమే దుర్లభము. కాని దేవికృపవల్ల మాకానాడు గూడ యామెచక్కగనే దర్శనమొసంగెను.

మధురలోగూడ నొక రాజమందిరమున్నది. అది ధర్మానాయుడు కట్టించినదట. తంజావూరిరాజైన తిరుమలనాయుడును మధురరాజైన ధర్మానాయుడును మామయల్లుండ్రట. తంజావూరి రాజమందిరముకంటె వేయిరెట్లధిక శిల్పకళానిపుణతను ప్రకటింపుచున్నది మధురరాజమందిరము. పదునాఱడుగుల చుట్టుకొలతగల పెద్దపెద్ద స్తంభములు గల యీరాజమందిరమందుగల శిల్పచాతుర్యమేమి చెప్పుదును? లతావితానములేమి? పుష్పమంజరులేమి? పక్షిజాతములేమి? మనుష్యప్రతిమలేమి? ప్రతిశిల్పము యథాతథముగ నచ్చొత్తినట్లుండెను. కల్యాణమండపమని యొకభాగముచూపిరి. అచ్చట పనితనమరయుటకు రెండుకన్నులు చాలవనిపించినది. దానికంటె రమణీయముగానున్నది శయ్యామందిరాంతర్భాగము. ఆయద్భుత శిల్పకళాభవన మరయుటచే విస్మయమును సంతసమును గలుగుటయేగాక నధికముగు విషాదముగూడ గలిగినది. అట్టియద్భుత శిల్పకళా

సౌందర్యమునకునికిపట్టులైన యున్నతోన్నత గోపుర ప్రాకారహర్మ్యావళుల నిర్మించిన యాశిల్పులిప్పుడేరీ! ఆప్రభువులిప్పుడేరీ! ఎట్టికళలునశించినవి? ఎట్టికళాకుశలు రస్తమించినారు! ఎట్టిరాజ్యములు రూపడినవి! ఎట్టిరాజులు దివంగతులైనారు! భూతవృత్తాంతమును వర్తమానముతో బోల్చిచూచిన మానసము దుఃఖసంతప్తమై నేత్రము లశ్రుసంసిక్తము లగునుగదా; అలనాడు రాజదర్బారులచే పూజితంబైన యాశిల్పకళామందిర మిప్పుడు దొరతనమువారి కచ్చేరీలకాశ్రయమైయున్నది. ఆదివ్యమందిరము కట్టుటకు ముప్పదైదు వత్సరములు పట్టెనట! సొమ్మెంత వ్యయమయ్యెనో!

మధురలో మనస్త్రీలు మోజుపడి కొనుక్కొనెడి వంటసామానులు పిండివంటలచ్చులు మొదలు మొట్లు అత్యధికముగాగలవు. రంగులద్దకమునకిక మధురఖ్యాతి సుప్రసిద్ధమేగదా.

అచటినుండి రామేశ్వరమున కేగితిమి. రామేశ్వరమొక చిన్నగ్రామము. పాడి పంటల సౌభాగ్యమేమూలను గానరాదు. ఇసుకతిప్పలు, తాటిచెట్లు, మొగలిపొదలు, నాగజెముళ్లుగలిగి మాజన్మస్థానమగు వాగర్త యెట్లుండునో అదియు నట్లేయున్నది. దక్షిణదేశపు దేవాలయము లన్నిటివలెనే రామేశ్వరపు ఆలయముగూడ గొప్పదేకాని పనితన మేమియు నంతగాగానరాదు. రామనాథపురపు రాజుల విగ్రహములును భక్తులవిగ్రహములును నచ్చటచ్చటనున్నవి.

ఒక్కదేవాలయపు ఆవరణయందే చతుర్వింశతి (24) తీర్థములున్నవి. అవిగాక ఊరివెలుపలగా లక్ష్మణతీర్థమను మఱియొకతీర్థమున్నది. రామేశ్వరము వెళ్లినవారు మొట్టమొదట లక్ష్మణతీర్థమందు స్నానముచేసి ప్రాయశ్చిత్తాదులు గావించుకొనిన వెనుకనే యాత్రార్హతగలుగును. మేమును అట్లేచేసితిమి. తరువాత ధనుష్కోటికి వెళ్లితిమి. ధనుష్కోటికి రామేశ్వరమునుండి రైలుమీద వెళ్లవలెను. ధనుష్కోటివద్ద సముద్రుడు నిస్తరంగుడై యుండును. రత్నాకరమహోదధియను నుభయసాగర సంగమనిచెప్పుదురు. కాని ఆయుభయసాగర సంగమమెచ్చటనో నాకుకానరాలేదు. అక్కడ యాత్రికులెల్లరు నూతనవస్త్రధారులై స్నానముగావింతురు. అచ్చటస్నానముచేసివచ్చి రైలులోనెక్కి పియర్ స్థానమునకువెళ్లితిమి. అచ్చటవిదేశమునుండి వచ్చుయాత్రికులను స్టీమరులోనుండి రైలులో కెక్కించుకొనుటకు రైలువంతెనమీదుగా స్టీమరువద్ద కేగును. సముద్రమచ్చట అగాధముగానున్నది. కాన తరంగము లుత్తుంగముగా వచ్చుచుండెను. మేమాప్రదేశమున కేగునప్పటికి దాదాపు పదునొకండు గంటలగుటచే నాపట్టపగటి యెండలో నీలమేఘ

శ్యామలకాంతులతో సాగరజలము రమణీయమై కన్పట్టుచుండెను. స్వచ్ఛమగు ధవళకాంతులీను ఫేనములతోగూడి యుద్వేగముగ దూకెడి యాతరంగము పోటుపాటులకు విస్మయజనకముగనుండుటయేగాక భయంకరముగగూడ నుండెను. రైలునిలిచిన వెంటనే మాకా సాగరభంగములను యోధులునడచినట్లు బారుబారులై చనుదెంచు ఫేనమాలికలను చూచుటకే సరిపోయెను. ఈలోపుగ తోలుపెట్టెలు, పరుపుచుట్టలు, కాఫీఫ్లాస్కులు, టిఫిన్ క్యారియరు మొదలగు నాగరికపు ప్రయాణవస్తువులతోను హ్యాట్లు, బూటులు, సూటు, కంటియద్దములు చేతికఱ్ఱలు మున్నగు అలంకారములతోను స్వదేశీయులగు నాగరికులెందఱో మాబండిలోనికెక్కిరి. అంత మాబండికదలెను.

ధనుష్కోటినుండి వచ్చినవెనుకనే యెవరైనను దేవాలయములో నభిషేకములు అర్చనలు మున్నగునవి చేయవలెను. మేమును అట్లేచేసితిమి. దక్షిణదేశపు దేవాలయములన్నిటను పూజాపురస్కారము లన్నిటికిని టిక్కెట్లు. టిక్కెట్టులేక రైలులోనికెక్కనీయరో, నాటకమునకెట్లు రానీయరో, ప్రదర్శనములనెట్లు చూడనీయరో, అట్లే టిక్కెట్టులేక దేవాలయము లోనికిగూడ రానీయరు. సమస్తహైందవులును సాధారణముగా దర్శించిపూజించి పరితృప్తినందవలసిన దేవాలయములు ఆధునిక నాగరికమర్యాదలనుబట్టి ప్రదర్శనములవంటి శాలలుగా మారిపోయినవి. అనగా సంపత్తిగలవారికే స్వామిదర్శనమన్నమాట. రుసుములేక స్వామి నిర్మాల్యపు పూరేకైన లభింపదు. స్వామిదర్శనము కేవల మీటిక్కెట్లతోడనేకాదు. లంచపంచము లిచ్చుటకుగూడ పాల్పడవలెను. ఇన్ని పాట్లుపడిన మీదట స్వామిదర్శనము. దక్షిణదేశముననేగాని యిట్టియనుచితపద్ధతులు ఉత్తర హిందూస్థానమున లేవనిచెప్పుదురు. సుప్రసిద్ధమైన కాశీక్షేత్రమున విశ్వేశ్వరుని ప్రతివారును స్వయముగాతాకి పూజింపవచ్చునట. దక్షిణదేశ దేవాలయములయందు పైవిధముగా నిర్బంధములును ప్రజాపీడయు పేదలనిరసనమును మిక్కుటముగా నుండుటచే స్వామిసాన్నిధ్యమున జనులకు నిజముగా కలుగవలసిన ఆస్తిక్యభావము శూన్యమగుచున్నది. పైపెచ్చు అచ్చటి అక్రమములు పీడలు దౌర్జన్యములు చూచుటచే మనస్సునందొక విధమగుకల్లోలమును, అసహ్యతాభావమునుగూడ గలుగుచున్నది. సగుణోపాసన పామరజనులు తరించుటకై యవసరమని కొందఱువాదింతురు. అదినిజమేనని యొకవిధముగా నంగీకరించినను దేవతామందిరములలో నుండవలసినంత పవిత్రతయు, శాంతిశ్రద్ధలును లేమిం జేసి నేటి హిందూదేవాలయములు ఏకాలదినుంది జనులజీవనోపాధికో సాధనములగు

చున్న వేకాని జనసముదాయమునకు జ్ఞానభక్తివైరాగ్యములను ప్రసాదించుపవిత్రస్థానములుగా నుండుటలేదు. దక్షిణదేశపు దేవాలయములకు పూర్వరాజదత్త సంపత్తియే యధికముగాగలదు. మఱియు పూర్వమువలె నడువవలసిన బాధలేకుండా యేర్పడిన నేటి ప్రయాణ సౌకర్యములవలనగూడ పూర్వముకంటె యాత్రికులనేక రెట్లధికముగా వచ్చుచున్నారు. ఇందువలనగూడ దేవస్థానములరాబడి యధికమైనది. కాన ఘోరమైన టిక్కెట్లవిధానము దేవస్థానములందు తొలగించిన బాగుగానుండును. స్వామికర్పించెడు దక్షిణలు జనులభక్తిశ్రద్ధలనుబట్టియు పేదభాగ్యములనుబట్టియు యథాశక్తిగ నుండవలెను గాని నిర్బంధముగా నుండుటయనుచితము. ఇందువలన పేదలెక్కువ శ్రమపడుచున్నారు. దాదాపొక సంవత్సరముక్రిందట నేనొక ప్రసిద్ధదేవాలయమున కేగితిని. అచ్చటికి వ్యాధిచేబాధపడుచున్న యొక పేదరాలేతెంచెను. అణా మూడుపైసలిచ్చినగాని యచ్చట కర్పూరహారతి నేయరని యామె తెలిసికొని యాడబ్బులను కొబ్బరికాయయు కర్పూరమును దీసికొని దేవాలయమునకేతెంచెను. కాని అణాటిక్కెట్టు కొనుక్కొనినగాని లోనికిబోవుటకు వలనుపడదని ద్వారరక్షకులామెను లోనికిబోనీయక నడ్డగించిరి. ఆమె పేదరాలనని వారినెన్నియోవిధముల ప్రార్థించెను. కాని వారు విడువలేదు. కాన ఆమె తనవద్దడబ్బులలోని యణాపెట్టి టిక్కెట్టుకొనుక్కొని లోనికేతెంచెను. అణావ్యయమైపోవుటచే నామెవద్ద కానీమాత్రమేయుండెను. కాన ఆకాలణాతో కర్పూరహారతిచేయుటకు అర్చకుడు నిరాకరించెను. "పేదరాలనునాయనా! అణా ద్వారం వద్ద తీసుకున్నారునాయనా! నాలుగేండ్లనుంచీ రోగంతో తీసుకుంటూ ఈస్వామిదర్శనంచేస్తే రోగంపోతుందని గంపెడాశతో ఎంతోదూరాన్నించి వచ్చానునాయనా! ఈకానిడబ్బుతీసుకొని కొంచెం కర్పూరహారతిచెయ్యిస్వామీ, పేదరాలికిచేస్తే నీకు పుణ్యంఉంటుందిస్వామీ" అనియాస్త్రీ యర్చకుని యెంతయోదీనముగ వేడుకొనెను. "డబ్బులేకుండా యీగుళ్లోకి యెందుకువచ్చావు. ఊరికే కర్పూరహారతి చేయడానికి నీవుపెట్టిననౌకరు లెవ్వరూలేరు. ఛీ!ఛీ! అని ఆ యర్చకుడు రూక్షవీక్షణుడై కఠినముగాపలికెను. వారు అర్చకులుగా నుండకున్నచో యింతకంటె దయాశీలురుగా నుండెడివారేమో! ఆసందర్భమును పరికింపుచు కొంతసేపు నేనచటనే నిలువబడితిని. ఆయర్చకుని మనస్సుకరగలేదు. ఆకర్పూరహారతిచేయక నాస్త్రీకి సంతుష్టి కలుగునట్లుగలేదు. అప్పుడాయర్చకునితో "ఆడబ్బులునేనిస్తాను. ఆమెకు కర్పూరహారతి చేయండి" అనినేనంటిని. ఆయర్చకునకు నామీదగూడ కోపమువచ్చెను. "మీకెందుకు మీరువెళ్లండి నేను చేసేదిలేదు." అనితీవ్రముగా బలికెను. "ఎందుకుచేయరు, మీకు కావ

లసినది డబ్బులేగదా ఆడబ్బులెవరికైనీకేమి చేయుండి” అని నేనంటిని. అప్పుడువిస్త్రీవలె చప్పునచల్లారెను. ఐదుకానులకొఱకు పేదరాలిపై తానుచేసిన కార్కశ్యమునకు అతనికో నతనికే సిగ్గుగలిగినది. అప్పుడాతడు నెమ్మదైనపలుకులతో 'నేనేనోర్చెదను. మీరు అమ్మవారి గుళ్లోకివెళ్లండి అమ్మా' అనెను. ఇదె నెందులకని నేనివలకువచ్చి వేసితిని. ఆవలనేను అమ్మవారి గుడియందుండగా కర్పూరహారతిచేసినాడని ఆస్త్రీవచ్చి నాతోచెప్పెను. ఈవిధము దేవతలు నేడు దౌర్జన్యపరులగు మానవులచేతిలో జిక్కి భక్తజనసులభులు గాకున్నారు. నేడు స్వామిదర్శనము కావలెనన్నచో నెట్టితోపిలో, యూనిఫారంప్రెస్సులో కావలెను. లేదా అయిశ్వర్య సమృద్ధియైన నుండవలెను. ఈరెండును లేనివారికిగతి రైల్వేకాలి గతియే. రామేశ్వరమునుండి ప్రతివారును తప్పకతెచ్చుకొనునవి గవ్వలు. రామేశ్వరము నందుతిప్ప మఱెచ్చటను గవ్వలు శంఖములు దొరకవు. అచ్చటగూడ గవ్వలందైదాఱు కంటె నెక్కువగలేవు. ఆయంగళ్లచుట్టును వివిధదేశపు స్త్రీలెట్లు మూగియుందురో ఆ చోద్యమునుచూచి తీరవలెను. ఆడవారి జేరమగుటచేతను, ఏవిధముగానైనను తీసికొనక మానరను విశ్వాసముచేతను గవ్వలతిప్రియముగ నమ్ముదురు. ఎనిమిది యాటగవ్వల తుదిధర నాలుగణాలు. అధికవెలగానున్నను అయిదులు, పదులు, రూకలుపెట్టి ప్రతిస్త్రీయును గవ్వలుతీసికొని వెళ్లుచునేయుండును. రామేశ్వరము వెళ్లెదమనిన గవ్వలుతెచ్చి పెట్టుడనుటయు, వెళ్లివచ్చితిమనిన గవ్వలుతెచ్చినారాయని యడుగుటయు మనదేశమందు పరిపాటియైనమాట, కాని యీగవ్వలవలనగల ప్రయోజనమేమి? జూదమువంటి ఆటను ఆడి విలువలేనికాలమును వ్యర్థముచేసికొనుటయేగదా. నేడుస్త్రీలు దేశహితార్థముచేయ వలసినకార్యములు నేర్చుకొనవలసిన విద్యలు లలితకళలు యెన్నియోయుండ యీగవ్వ లాటలాడ నెవ్వరిచ్చగింతురు? నాకు దానిపై బొత్తిగా మోజులేదు. అయినను యాత్రా చిహ్నముగా కొన్నిగవ్వలు కొనక నాకును తప్పినదికాదు. తాటియాకులతో సొగసుగా నల్లబడిన బుట్టలు పెట్టెలుగూడ నచ్చట విరివిగాదొరకును. గవ్వలు పటములుకొనిన వారా బుట్టలనుగూడకొని వాని నాబుట్టలలోపెట్టుకొని యిండ్లకు తెచ్చుకొందురు.

రామేశ్వరమునందు గంధమాదనపర్వతమను పేరుతో నొకయిసుకతిప్పయున్నది. దానిపైరాతితో మలిచిన రామపాదచిహ్నములు గల చిన్న ఆలయమొకటిగలదు. దానిపైకెక్కినచో నడుమ బిళ్లవలె రామేశ్వరపు లంకయు దానిచుట్టును భూపురంధ్రి మణితాల్చిన యింద్రనీలముల మొలనూలు పగిది సాగరము మనోహరముగా గన్ప

ట్టును. అదిచూడదగిన దృశ్యమే. అటనుండి మేము క్రిందికి వచ్చుచుండ ఎనుబదేండ్లు దాటిన వృద్ధురాలును నామెతో మఱియిద్దఱును మాకెదురైరి. ఆవృద్ధురాలు మిక్కిలి దుర్బలముగానుండి కన్నులు తేలిపోవుచుండ మిక్కిలి ఆయాసపడుచు నడుచుచుండెను. ఆకృతులనుబట్టి వారు ఉత్తర హిందూస్థానము వారని తెలియుచున్నను ఏప్రాంతమువారో తెలిసికొనవలయునని కుతూహలముతో "మీదే దేశ"మంటిని. "నేపాళదేశ"మని యా వృద్ధురాలనెను. నాకు మహాశ్చర్యమయ్యెను. ఎక్కడి శీతనగము! ఎక్కడిసేతువు! నిండు వార్ధక్యమున నావృద్ధురాలి నావిధముగా నీడ్చుకొని వచ్చిన మతవిశ్వాసము పుణ్య కాంక్ష అత్యద్భుతముగదా! ఆకృతులలో భేదమున్నను, ఆచారములలో మార్పు లున్నను, భాషలలో భిన్నత్వమున్నను, వేషములోవ్యత్యాసమున్నను, ఆసేతుశీతనగ పర్యంతముగల యావద్భారతీయుల నైక్యపఱచుచున్నదేది! మత సూత్రమేగదా? మతము మానవునకు ప్రాణముకంటె నుత్కృష్టమైనది.

కల్పలతా! వ్రాయవలసిన విషయములు పెక్కులున్నను లేఖా విస్తరభీతి లేఖినిని వెనుకకీడ్చుచున్నది. ఇప్పటికే లేఖ పరిమితిని మించినది. కానయింకొక్క మాటతో ముగించెదను. మిత్రమా! మేమీ విధముగా హిందూదేశపు సుప్రసిద్ధక్షేత్రములలో నొక్కటైన రామేశ్వర క్షేత్రమందు ద్వాదశదినములు గడపి పర్వతవర్ధనీ రామలింగేశ్వరుల పలుమాఱు సేవించి అనంతపద్మనాభస్వామిని దర్శింపకుతూహలము గలుగుటచే నచ్చటికేగుటకై రామేశ్వరమునుండి మధురకువచ్చి అక్కడనుండి త్రివేంద్రము వెళ్లు బండినెక్కితిమి. త్రివేంద్రమువెళ్లుచు మార్గ మధ్యమున మేముచూచిన మొదటిక్షేత్రము తెంకాశీకి సమీపముననున్న కుర్తాళం. ప్రకృతి శోభావిభాసితంబై నేత్రపర్వంబైన యార మణీయ ప్రదేశమును గూర్చిముందువ్రాసెదను.

మిత్రురాలు

శారద.